# ప్రేతాత్మల ప్రేలాపన!

మరణించిన ప్రతి ప్రాణికీ మరు జన్మ వున్నదో లేదో అంతుబట్టని విషయం! శాస్త్రజ్ఞులు సైతం ఈ అంశం గురించి తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. మానవమేధ ఈ విషయం తెలుసుకోలేక పోతోంది!

శాస్త్రాలు మరొక విధంగ చెప్తున్నయ్! పునరపి జననం... పునరపి మరణం...' అనేది ప్రాచుర్యంలో వుంది.

శ్రీకృష్ణభగవానుడు 'గీత'లో ఇదే విషయాన్ని గురించి అర్జునుడికి బోధించినట్టు పవిత్ర గ్రంథమైన భారతం చెప్తోంది!

సృష్టికి ప్రతిసృష్టి చేసి త్రిశంకు స్వర్గాన్ని క్రియేట్ చేసిన ఘనుడు విశ్వామిత్ర ముని!. అలాంటప్పుడు మరో జన్మ ఎందుకు వుండదూ? అనేది వాదన!

ఇదొక పెద్ద విషయం! దీనిని విశ్లేషించటానికి మిడిమిడి జ్ఞానం చాలదు. మరు జన్మ వున్నదో లేదో అనే విషయాన్ని పక్కనపెట్టి కథలోకెడదాం!

ప్రేతాత్మల మీద ఒక కథ వ్రాయాలన్పించింది! పాఠక మహాశయులు కూడా రొటీన్ టైప్ ఆఫ్ స్టోరీస్ చదివి చదివి విసిగివుంటారని భావించి వెరైటీగా వుండాలని ఈ కథ వ్రాయ సంకల్పించాను.

వినూత్న పంథాలో నడిచే ఈ కథకి ప్రేరణ మనసు కవి ఆత్రేయ! 'మరుజన్మ వున్నదో లేదో... ఈ మమతలు అప్పుడేమౌతాయో' అంటూ తాత్విక దృష్టి మిక్స్‌చేసి ప్రేమనగర్ సినిమాలో అద్భుతమైన పాట అందించారు.

అందుకే ఈ కథని మనసుకవి ఆత్రేయగారితోటే ప్రారంభించటం సముచితం!

ఈ కథకి ఫస్ట్‌షాట్...ఫస్ట్ 'క్లాప్' ఇక్కడే కొట్టి మొదలుపెడతాను! ఇదే సందర్భోచితంగానూ వుంటుంది!

ఆత్రేయ గారు మరణించి ఏళ్ళు దాటినా... వారి ప్రేతాత్మ ఇంకా శూన్యంలోనే తిరుగాడుతోందన్న విషయం తెల్సుకుని ఇంటర్వ్యూ చేయటానికి కెమెరామెన్‌తో సహా పైకి వెళ్ళాను

నేను 'అందరి టీ.వీ.' విలేఖరిని. ప్రేతాత్మలతో ఇంటర్వ్యూ జరపాలనే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని ఇంతదూరం వచ్చాను! ఈ విషయంతో మీరు కాస్త సహకరించి నా ప్రశ్నలకు జవాబులిస్తే మా టీవీ ప్రేక్షకులు పరమానందభరితులవుతారు! నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

'నిజమే! నేను నా అభిమానులకు దూరమై చాలా ఏళ్లయిన మాట వాస్తవం...' నవ్వేరు ఆత్రేయ.

'మరుజన్మ వున్నదో లేదో అని పాట వ్రాసిన మీకే మళ్ళీ మానవజన్మ ప్రాప్తించలేదా సార్?...'

నా ప్రశ్న ఆత్రేయగారిని కలవరపెట్టింది.

'పాట కాకుండా మాటల్లో చెప్తాను. మానవజన్మకోసం తాపత్రయపడటంలేదు. తగిన సమయం వచ్చినపుడు... నేను కోరిన గర్భం నాకు లభించినపుడు మాత్రమే అవకాశాన్ని తీసుకోదలచాను! నా మనసుకి నచ్చే తల్లి గర్భంకోసం ఎన్ని ఏళ్ళయినా ఇలాగే ప్రేతాత్మలా పరిభ్రమిస్తూనే వుంటాను...'

'అంతేనంటారా? భూలోకంలో వేటిమీదా మీకు మోహంలేదా?...'

'వుంది! ఈ ప్రశ్నకు సమాధానం అవకాశం వచ్చినప్పుడు చెప్తాను. ఇప్పుడు కాదు...'

'పాటలు మాటలు రాయటానికి నిర్మాతలను ఏడిపించినట్లే ఇప్పటికీ మీకా బుద్ధిపోలేదు. విలేఖరినైన నన్నే తిప్పలు పెడుతున్నారు చూశారా?'

ఇంతలో మహాకవి శ్రీశ్రీ గారు తారసపడ్డారు. వారి ప్రేతాత్మ నావైపు ఎగాదిగా చూచింది. నేనెవర్నైందీ పోల్చుకోలేక సతమతమౌతూండటం గమనించి...

'ఏం సార్! సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి ఇక్కడే శాశ్వతంగా వుండిపోయేటందుకు నిర్ణయించుకున్నారా?... ఇక్కడి ప్రపంచానికి కూడా సమిధను ఆహుతిస్తున్నారా?... రాళ్ళెత్తిన కూలీలెవ్వరు అంటూ ఇక్కడి శ్రమజీవులను ప్రశ్నిస్తున్నారా?...'

'ఎన్ని జన్మలెత్తినా నా సిద్ధాంతాలు మార్చుకోను. నేను చాలా మొండివాడిని. ఇంతకు మీరెవరో చెప్పనేలేదు?...'

'నేనొక టి.వి. విలేఖరిని. ఇక్కడి ప్రేతాత్మలను ఇంటర్వ్యూ చేద్దామని వచ్చాను. అదిసరె మీరు చైన్ స్మోకింగ్ చేసేవారు కదా? ఇప్పుడు ఇబ్బందిగా లేదూ?...'

'భూలోకంలో సిగరెట్లతో పట్టిన సిగపట్లు చాలు. ఇకపోతే జన్మగురించి అంటారా. రష్యాలో పుట్టాలని కలలు కంటూన్నాను. అక్కడ 'ఓడ్కా' సేవిస్తూ... ఎర్రజండా వినువీధుల ఎగరేస్తూ దేశాధినేత నవాలని కోరికగా వుంది. అందుకే ఈ వెయిటింగ్...'

'అయితే కలాన్ని హలాన్నీ... హలాహలాన్నీ... అగ్గిపుల్లనీ... సబ్బుబిళ్ళనీ మర్చిపోయారా?

'నేను దేన్నీ మరువను. నేను సైతం సమిధనై ప్రపంచాగ్నికి ఆహుతై ఇక్కడి కొచ్చాన ఆ విషయం మరువకండి...'

అటుగా వెడుతున్న హాస్యబ్రహ్మ జంధ్యాలగారి ప్రేతాత్మ నన్ను చూచి గుర్తించి దగ్గరకొచ్చి 'ఏమిటిలా వచ్చారు' అంటూ ఆప్యాయంగ కౌగలించుకుని పలుకరించింది.

ఇద్దరం ప్రాణమిత్రులం. ఒకే కాలేజిలో చదివిన పరిచయం స్నేహం మాది.

ఇంతలో రేలంగి ప్రేతాత్మ అటుగా వచ్చి మాతో జాయినైనారు.

"ఏం జంధ్యాల గారూ? ఏదైనా పిక్చర్ ప్లానింగా?- నాకో వేషం ఇప్పించండి అదరగొట్టేస్తాను! ... అరె! మన మాటల పాటల రచయితలు ఆత్రేయ శ్రీశ్రీలు కూడా ఇక్కడే ఉన్నారంటే మన పిక్చర్ హిట్టయిందన్నమాటే...' సహజధోరణిలో మాట్లాడింది రేలంగి ప్రేతాత్మ!

'ఎంతకాలమైందండీ సహజసిద్ధమైన మీ కామెడీ కళ్ళారాచూచి?- ఇప్పటివారంతా మీ ముందు బలాదూర్! అంతా కృతకమే-కామెడీలోని నేచురాలిటీ హుష్కాకైంది...' జంధ్యాల ప్రేతాత్మ మనసులోమాట బహిర్గతం చేసింది.

'సినిమావారి ఆత్మలన్నీ ఒక్కచోటే గుమిగూడటం చిత్రం! భళారే విచిత్రం...' అనే రేలంగి ధోరణికి అన్ని ప్రేతాత్మలూ పగలబడి నవ్వినయ్.

'రెండు కొప్పులు చేరినా... ఇద్దరు పాటల రచయితలు ఒక చోట వున్నా అగ్గి భగ్గుమంటుందంటారు! మీ కామెంట్ ప్లీజ్...' జంధ్యాలని ప్రశ్నించాను.

'కొప్పుల మాటలు... అప్పుల మాటలు అడక్కండి. బహుతిప్పలు ఎవరికైనా తప్పవు...' చమత్కరించాడు జంధ్యాల.

'అరె! సంగీత చక్రవర్తి మన 'చక్రవర్తి' గారి ప్రేతాత్మ కూడా ఇటే వస్తున్నది...' నా మాటకి అన్ని ప్రేతాత్మలు అటుగా చూచినయ్.

ఎన్టీఆర్ ప్రేతాత్మ సడన్‌గా ఎక్కడినుంచి వూడిపడిందోగాని మాముందు కొచ్చి నిల్చి మేం పిలుస్తున్నామని మన మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తిగారి ప్రేతాత్మకు చెప్పి కేకేయండి...' ఠీవిగా అన్నాడు.

'కవి నట దర్శక శ్రేష్ఠులకు శతకోటి వందనాలు' వస్తూనే అందరికీ నమస్కరించింది చక్రవర్తి ప్రేతాత్మ.

నేనొచ్చిన పని క్షణంలో ఎన్టీఆర్‌గారి ప్రేతాత్మకు... చక్రవర్తిగారి ప్రేతాత్మకు విన్నవించుకున్నాను.

'నేనూ... సంగీత విద్వాంసురాలైన సంగీతలక్ష్మిలాంటి తల్లి గర్భంకోసం వెతుకుతూనే వున్నాను. మళ్ళీ మానవలోకాన జన్మించి సినిమా సంగీత దర్శకుడినై మరెన్నో కొత్త ట్యూన్స్‌కి వూపిరిపోయాలనుంది...' చక్రవర్తి ప్రేతాత్మ అత్యుత్సాహంగ అంది.

'తమ్ముళ్ళూ! ఇహ నా విషయమంటారా... నటుడిగా వందజన్మలకు సరిపడేటంత కీర్తి

ప్రతిష్ఠలు ఆర్జించాను. లెక్కకు మిక్కిలి డబ్బు సంపాదించాను...' ఎన్టీఆర్ ప్రేతాత్మ హుందాగా తనదైన శైలిలో అంది.

'సార్! మళ్ళీ రాష్ట్ర రాజకీయాల్లోకి రారా!' అడిగాను.

'వద్దు బ్రదర్! నన్ను మళ్ళీ ఆ రొంపిలోకి లాగకండి! బుద్ధి గడ్డి తిని రాజకీయాలలో గల కుళ్ళు తెలీక ఒకసారి అశుద్ధం తొక్కేను. నన్నిలా వుండనీయండి! నాలో ఏ కోరికలూ లేవు. రోతపుట్టిన రాజకీయాల జోలికి పోతల్చుకోలేదు. కాకపోతే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిలా... పరమ పావనమైన జన్మకోసం ఎదురుచూస్తున్నాను!- అహా... శ్రీశ్రీ వారా!?... మీరిప్పుడు హాలికులా... ఆల్కాహాలికులా?...' అంటూ ఎన్టీఆర్ నవ్వారు.

ఎన్టీఆర్ ప్రేతాత్మ నిర్ణయానికి చుట్టూ వున్న ప్రేతాత్మలన్నీ చప్పట్లు చరిచినయ్.

వారినుంచి తప్పించుకుని ముందుకు సాగేను. ఎంతదూరం వెళ్ళానో నాకే తెలీదు. కానీ... తలవని తలంపుగా 'గాంధీ' గారి ప్రేతాత్మ ఎదురైంది. ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

'మహాత్మా!... ఓ జాతిపితా... నమోవాకములు! నేను కొత్తగా పెట్టిన టి.వి. ఛానల్ విలేఖరిని...' వారిని చూచి సంభ్రమాశ్చర్యాలతో నాగురించి విన్నవించుకున్నాను.

గాంధీజీ చిద్విలాసంగ నవ్వారు.

'మీవంటి దేశభక్తులు... దేశాభిమానులు... ఇంకా శూన్యంలోనే ప్రేతాత్మగా సంచరించటం శోచనీయం' అన్నాను.

గాంధీజీలో వెనకటి వుత్సాహం అవుపించలేదు. 'మిమ్మల్ని చూస్తుంటే బ్రిటీష్‌కాలం నాడు మీరు సలిపిన పోరాటాలు గుర్తుకొస్తున్నయ్... తిన్న లాఠీదెబ్బలు... జైలు జీవితం.. ఉప్పు సత్యాగ్రహం... అన్నీ కళ్ళముందు మెదులాడుతున్నాయ్...' గతాన్ని గుర్తు చేసుకుంటూ మాట్లాడసాగింది జాతిపిత ప్రేతాత్మ.

'గతమెందుకు ప్రస్తుతాన్ని గురించి మాట్లాడుతారా?'

నా ప్రశ్నకి జవాబుగ 'ఆరోజులే వేరు. మరో వందేళ్ళు నాకు ఆయుర్దాయం వుండివుంటే. దేశకాలమాన పరిస్థితులు ఈనాడు ఇలా వుండేవి కాదు కదానిపిస్తుంది... ఏం చేద్దాం ఆయుష్షు మూడి తుపాకీగుండుకి బలయ్యాను...' మాటల్లో బాధ ధ్వనించింది.

'నిరాశ చెందకండి బాపూ! మళ్ళీ మీరు భారతావనిలో మరో మహాత్ముడిగా జన్మించండి సామాజిక ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దండి. నీతి నియమాలను పునరుజ్జీవింపచేయాలి నేడు మీవంటి మహామహులు... దేశభక్తి పరాయణులు కరవైనారు! ఇప్పటికే చాలా ఆలస్యం చేసారు. మీరేమంటారు మాజీ జాతిపితా?-'

నా ప్రశ్న విని నిట్టూర్చారు గాంధీ!

'నేటి రాజకీయాలు నన్ను దరి చేరనీయవు. అవి దుర్గంధపూరితమై... స్వార్థ ప్రయోజనాలతో కుళ్ళు కంపు కొడుతున్నయ్. కులమతవర్గ పోరాటాలతో కొట్టుకు ఛస్తున్నారు. నైతిక విలువలు అంతరించిపోతున్నయ్. వాదోపవాదాలు... నిరసనలు... వెన్నుపోటు రాజకీయాలతో దేశం భ్రష్టు పట్టింది. అందరివీ అవకాశవాద రాజకీయాలేగాని ప్రజాసేవకు అంకితమైన నాయకులు కానరారు! ఇక్కడ్నించి నేను అంతా గమనిస్తూనే వున్నాను. అవినీతి దురన్యాయం మితిమీరుతోంది. అందుకే ఈ మనుష్యుల మధ్య మనలేను. నాలో దైవ చింతన ప్రబలింది. చనిపోయే సమయాన కూడా 'హేరామ్' అంటూనే తుదిశ్వాస విడిచాను. పాలిటిక్స్‌లో పవర్‌మాంగర్స్ ఎక్కువైనారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటానికి ఎందుకు నడుము బిగించానాని?... ఉప్పు సత్యాగ్రహం ఎందుకు చేసానాని? ఇప్పుడు చింతిస్తున్నాను! అందరి లోనూ ఇప్పుడు ఆగ్రహం ఆవేశకావేశాలు ఎక్కువ! అనుగ్రహించేవారే లేరు. ఇక సత్యాగ్రహాలు చేయగల సత్యసీశీలురెక్కడ భువిలో? నేను మానవజన్మ ఎత్తలేను. మరికొద్ది కాలంలో శ్రీహరిలో ఐక్యమై పోతాను. స్వామి నన్ను కరుణించి అనుగ్రహించాడు. అంతవరకూ ఈ శూన్యంలోనే ప్రేతాత్మగా తిరుగాడక తప్పదు...' గాంధీజీ అశ్రుపూరిత నయనాలతో మాట్లాడాడు.

నా హృదయం ద్రవించింది.

'నేను కాసేపు విశ్రమించాలనుకుంటున్నాను. వెడతాను...' అంటూ వెనుదిరిగిన జాతిపిత గాంధీజీకి ఎదురొస్తున్న ఒకనాటి భారతావని ప్రధాని ప్రజల ప్రియతమ నాయకురాలు అయిన శ్రీమతి ఇందిరాగాంధీని చూచి ఒక్క నిముషం నిలబడ్డారు.

ఆమె ప్రేతాత్మను చూచేసరికి పట్టలేని ఆనందంతో పొంగిపోయాను. ఆమె పాదాలచెంత సాష్టాంగపడ్డాను.

'ఎవరు బాబూ నీవు!' రెండు చేతులతో లేవనెత్తి నాముఖంలోకి తేరిపార చూస్తూ వాత్సల్యంతో అడిగింది ఇందిరాగాంధీ ప్రేతాత్మ!

'బేబీ!... నీ ప్రేతాత్మ ఇంకా ఇక్కడే పరిభ్రమిస్తోందా?... నీ వంటి మేధావి సేవలు భారతీయులకు ఎంతో అవసరం కదా?! ఈ పాటికే ఏ పుణ్యమూర్తి గర్భానో నీవు మానవజన్మ ఎత్తి వుండి వుంటావని అనుకుంటున్నాను...' కరచాలనం చేసి అన్నారు జాతిపిత.

'అంతటి అదృష్టం లేకపోయింది పితాజీ దేశ స్వాతంత్ర్యంకోసం మీరు... భారత ప్రజానీకం అభ్యున్నతికోసం పోరాడి నేనూ ఇద్దరం తుపాకీ గుండుకు బలైనవాళ్ళమే!

'వారి వాత్సల్యానికవి తీపి నిదర్శనాలు ప్రియదర్శినీ...' గాంధీ స్వరంలో వెటకారం ధ్వనించింది.

'ఈ దోపిడీ వ్యవస్థలో... మనిషిని మనిషి హత్యచేసే నేటి రాజకీయ పరిస్థితులు మనకు సరిపడవు గాంధీజీ! అందుకని ఇలాంటి దౌర్భాగ్యపు దేశంలో మళ్ళీ జన్మించాలని కోరుకోవటంలేదు. ఇప్పటి నాయకులకు ప్రజలకు మన సిద్ధాంతాలు రుచించవ్. పుట్టి వారిచేతిలో మరల చచ్చేకంటే... ఇలా ప్రేతాత్మగానే మిగిలిపోవటం శ్రేయస్కరం! రాజకీయాలు కుళ్ళిపోతున్నయ్... స్వార్థం పెచ్చుమీరుతోంది!'

గాంధీజీ... ఇందిరాగాంధీ మాటలకు చిద్విలాసంగ నవ్వేరు.

ఓ పత్రికా విలేఖరిగా కేవలం ప్రేతాత్మలు చెప్పేవి శ్రద్ధగా విని టేప్ చేసుకోవటమే నా కర్తవ్యం అనే ధోరణిలో వున్నాను.

'బాపూ! మిమ్మల్నీ... నన్నేకాదు... చివరికి నా కుమారుడు రాజీవ్‌ని కూడా ఈ మనుషులు బ్రతకనివ్వలేదు. చంపి... కాదుకాదు... హత్యలుచేసి కక్ష తీర్చుకున్నారు- మనం కాలంచేసిన తర్వాత మనకు శిలావిగ్రహాలు పెట్టారు. నిలువెత్తు పూలమాలలతో ఏటా ముంచెత్తుతూ స్మరించుకుంటున్నారు. అంతా డ్రామా!

అంతా నాటకం! కపట నాటకం! ఇవన్నీ రాజకీయకుయుక్తులు! మనం ఎరగనివా? అందరిపీ నక్క వినయాలే!

ఇటువంటి మనుష్యులకు... పరిస్థితులకు దూరంగా వుంటేనే మంచిది.

మరో జన్మను నేను కోరుకోవటంలేదు. హరినామస్మరణలో ఆ దేవునిలో ఐక్యమై పోవటానికి... శాయశక్తులా భక్తితో కైవల్యసాధనకై నిర్విరామంగ కృషి సలుపుతున్నాను!!-'

'శెభాష్ తల్లీ! నీకు ఇప్పటికి కనువిప్పు కలిగింది. చనిపోతే వెంటరాదేదీ... సర్వమానవాళి ఈ విషయాన్ని గ్రహిస్తే... సన్మార్గాన్ని అనుసరిస్తే మానవుల భవిత ఉజ్వలంగా వుంటుంది...' ఇందిర భుజం తట్టారు గాంధీజీ.

నేనొచ్చిన పని పూర్తి కావటంతో తిరిగి మళ్ళీ భూమ్మీదకి వచ్చేశాను. ప్రేతాత్మల ప్రేలాపనలను టి.వి.లో టెలికాస్ట్ చేయటం జరిగింది. శుభం!

ప్రజలు పరమానంద భరితులైనారు. టీ.వి వారి కొత్త ఆలోచనకు రెస్పాన్స్ బాగ వచ్చింది.

సర్వేజనా సుఖినోభవంతు! సన్మంగళాను భవంతు!!

- సమాప్తం -